# గీటురాయి

(కథానిక)

"హితశ్రీ"

రైలాగింది. ఇంటరు క్లాసు పెట్టెకోసం వెతుక్కుంటూ హడావడిగా నడుస్తున్న వాసుదేవరావుని చూసి ఓ వ్యక్తి సంతోషంతో కేక వేశాడు.

"వాసూ"

రైలు పెట్టెల కేసి చూస్తూ నడుస్తున్న వాసుదేవరావు ఈ కేక విని ముందుకు చూసి ఆనందం పట్టలేక గట్టిగా అరిచాడు.

"హల్లో, శేఖరం."

ఇద్దరి కళ్ళల్లో కాంతులు ప్రతిఫలించాయి.

"ఎలాగైనా చాలా మారావురా శేఖరం. మూడేళ్ల కిందట సన్నగా, పీలగా ఉండేవాడివి. ఇప్పుడు బాగా లావయ్యావు."

"మారటం సహజమేగా. మారకపోతేనే ఆశ్చర్యపడాలి."

"నిజమేగాని, ఈ మూడేళ్ళ నించీ బొత్తిగా ఐపులేకుండా పోయావేం?"

"ఏం చెయ్యను? తీరిక ఉంటేగా. అయినా ఎక్కడ మద్రాసు, ఎక్కడ గుంటూరు? వచ్చిపోవాలంటే కనీసం నాలుగు రోజులైనా సెలవు పెట్టాలి. అయినా నన్నంటావుగాని, నువ్వుమాత్రం మద్రాసు రాకూడదా యేం?"

సమాధానంగా వాసుదేవరావు చిరునవ్వు నవ్వాడు. మందహాసంతో శేఖరం అన్నాడు:

"కొత్త కాపరం గావునులే. నీమీద తప్పు పట్టటం సమంజసం కాదు."

మాట మారుస్తూ వాసుదేవరావు అన్నాడు:

"రైలు ఖాళీగానే ఉందనుకుంటాను."

"ఏదో ఉంది. కూర్చునే ప్రయాణం చేశానులే. నా స్నేహితులు కూడా ఇద్దరు ముగ్గురు ఈ రైల్లోనే వచ్చారు. వాళ్లుండబట్టి ప్రయాణం కులాసాగా జరిగింది. స్నేహితులంటే జ్ఞాపకం వచ్చింది. మనవాళ్లెవరెలా ఉన్నారూ, ఏమేం చేస్తున్నారూ?"

వాసుదేవరావు విపులంగా తమ స్నేహితుల్లో ఎవరెవరు ఏయే పదవుల్లో ఉన్నదీ ఏకరువు పెట్టసాగాడు. ఇంతలో స్టేషన్లో గంటలు కొట్టారు. గంటలు విని శేఖరం ఉలిక్కిపడ్డాడు.

"అరె, లేడీస్ కంపార్టుమెంటులో మావాళ్లెక్కారు. మాటల సందడిలో ఆ సంగతి మర్చిపోయాం. బోలెడంత సామాను కూడా ఉంది. త్వరగా పద."

వాసుదేవరావు నాలిక కరుచుకున్నాడు. ఇద్దరూ హుటాహుటిగా ఆడవాళ్ల ఇంటర్ పెట్టె దగ్గిరికి వచ్చారు. అప్పటికి శేఖరం భార్య సామానంతా దింపించి, పిల్లవాడిని ఎత్తుకుని శేఖరంకోసం ఎదురుచూడ సాగింది.

అతన్ని కొంతదూరంలో చూడగానే ఆమెలో అణిగిన కోపం ఒక్కసారిగా పైకుబికింది. శేఖరం ఓ చిన్న పొరపాటుకూడా చేశాడు.

"సామాన్లు ఏమీ మర్చిపోలేదుగదా?"

ఆవిడకి ఒళ్లు మండింది. రైలాగగానే వచ్చి సామాను దింపించటం లేకపోగా, రైలు కదిలే వేళకి తాపీగా వచ్చి ఈ తనిఖీ ఏమిటి? అతని వైపు చురచుర చూస్తూ అంది.

"ఇంకా కాసేపటి తరవాత వచ్చి తనిఖీ చెయ్యకపోయారా?"

శేఖరం తన తప్పు గ్రహించినవాడు కావటంవల్ల కిక్కురు మనకుండా సామాన్లు లెక్కపెట్టే పనిలో నిమగ్నుడయాడు. వాసుదేవరావు ముసిముసి నవ్వులు నవ్వుతూ అన్నాడు.

"తప్పు నాదిలెండి."

"చూశావా ఉమా, నా తప్పులు పంచుకునే స్నేహితుడు కావటంవల్లే వీణ్ణి అంతగా పొగుడుతూండేవాణ్ణి. అప్పుడే నీకు ఉదాహరణ దొరికింది, చూశావా?" అన్నాడు శేఖరం. ఉమ కొంత సిగ్గుగా తల పక్కకి తిప్పి పమిట కొంగు మెలేసింది. శేఖరం

సామాన్లు లెక్కపెట్టి అన్నీ సరిగానే ఉన్నాయని ప్రకటించి వాటిని పోర్టర్లకి ఒప్ప చెప్పాడు. సామాన్లూ, వాసుదేవరావూ ఓ బండిలో; శేఖరం, ఉమా, వాళ్ల పిల్లవాడూ మరో బండిలో వాసుదేవరావు ఇంటికి ప్రయాణమయారు.

దారి పొడుగునా వాసుదేవరావు ప్రశంస వినలేక ఉమ చెవులు చిల్లులు పడ్డాయి. విసిగి అంది:

"ఏం పొగుడుతారు లెద్దురూ, ఈ నెల రోజుల మకాంతో మొహం మొత్తుతుంది లెండి."

ఉమ ఈ మాటలు యథాలాపంగానే అన్నా, శేఖరం మనసు కొంచెం కష్టపడ్డది.

"వాసు సంగతి నీకింకా బాగా తెలియదు ఉమా."

ఉమ మాట్లాడలేదు. శేఖరం మాత్రం వాసుని పొగడటం మానేశాడు.

మరి కాసేపటికి వాసుదేవరావు ఇల్లొచ్చింది. శేఖరం కుటుంబానికి మేడమీద ప్రత్యేకంగా బస ఏర్పాటయి ఉంది. వీళ్ళంతా వొచ్చేప్పటికి వాసుదేవరావు భార్య వాసంతి, కాఫీ, ఫలహారాలు మేడమీద టేబిల్‌పై అమర్చి ఉంచింది. కాఫీ, టిఫిన్ మొక్కు తీర్చుకుని రాత్రి భోజనాలకి పిలుపొచ్చేదాకా బాతాఖానీ వేశారు స్నేహితులిద్దరూ. భోజనాలయింతరువాత కూడ మళ్ళీ ఒంటిగంటదాకా మాటాడుకుంటూనే ఉన్నారు.

గడియారం ఒంటిగంటకొట్టింతరవాత వాసుదేవరావు కిందికి వెళ్ళిపోయాడు. శేఖరం పడక గదిలోకిపోయి లైటు వేశాడు, పక్క వేసుక్కోటానికి.

"అయిందా మాట్లాడుకోటం?"

శేఖరం ఆశ్చర్యపడి అన్నాడు:

"నువ్వింకా నిద్ర పోలేదా?"

"పక్క గదిలో గోడలు మారుమోగేట్టు నవ్వులూ, కేకలూ వినబడుతూంటే నిద్ర ఎలా పడుతూంది?" కొంచెం కోపంగా అంది ఉమ.

శేఖరం మాట్లాడలేదు. చిన్నగా నవ్వాడు.

"కొంపతీసి రోజూ ఇలాగే బాతాఖానీ వెయ్యరు గదా!"

దీనికి కూడా సమాధానం చెప్పటం అనవసరం అనుకున్నాడు శేఖరం. సమాధానంగా మళ్ళీ చిరునవ్వు నవ్వాడు, కాని లైటు వెలుగులో ఉమ ముఖం చిట్లించుకోటం గమనించి అన్నాడు:

"రోజూ మాట్లాడటాని కేముంటుందిలే."

రోజూ మాట్లాడటాని కేముండేదోగాని, ప్రతిరోజూ వాసూ, శేఖరం ప్రొద్దున నిద్ర లేచి నప్పటినించీ రాత్రి ఒంటిగంట, ఒక్కొక్కప్పుడు రెండు గంటలు కూడా కొట్టేదాక ఏవో మాట్లాడుకుంటూనే ఉండేవాళ్లు. శేఖరం వొస్తాడని ముందే తెలియటం వల్ల ఓ నెల రోజులు సెలవు ముందే మంజూరు చేయించుకున్నాడు వాసు.

శేఖరం వచ్చి పదిహేనురోజులు గడిచాయి. ఈ పదిహేను రోజులూ రెండు ప్రాణులు ఎంత సంతోషంగా, హాయిగా గడిపాయో, మరో రెండు ప్రాణులు అంత విసుగ్గా, కోపంగా, నైరాశ్యంతో గడిపాయి.

ఓ రోజు సాయంత్రం షికారు కెళ్లడానికి ఇస్త్రీ దుస్తుల కోసం వాసంతిని పిలిచాడు వాసుదేవరావు. ఆమె అతని పిలుపుని విని కూడా మాట్లాడకుండా కూర్చుంది. ఆమె వినలేదేమోనని మళ్ళీ పిలిచాడు అతను. ఈసారి కూడా ఆమె పలకలేదు. చేతిలోని పుస్తకం పేజీ మాత్రం తిప్పింది నిర్లక్ష్యంగా. వాసుదేవరావుకి ఆశ్చర్యం వేసింది.

"వాసంతీ." ఆమె దగ్గరికి వెళ్లి భుజం తట్టాడు.

"ఊఁ"

"బయటికెళ్ళాలి. కాస్త ఇస్త్రీ బట్టలు తెచ్చిపెట్టు."

"బీరువాలోనే ఉన్నాయిగా."

ఇటువంటి సమాధానం ముందెప్పుడూ విననందువల్ల, వాసుకి అమితాశ్చర్యం వేసింది. బహుశా చదివే పుస్తకం బాగుండటంవల్ల లేవాలనే బద్ధకంతో అలా అందేమోననుకున్నాడు. అంచేత మాట్లాడకుండా బీరువా దగ్గిరకెళ్లి గుడ్డలు తెచ్చుకున్నాడు. బయటికి వెళ్ళబోతూ మంచినీళ్లు తాగివెడదామని మళ్ళీ లోపలికొచ్చి వాసంతి పుస్తకం మూసేయటం గమనించి అడి-

గాడు:"కాసిని మంచినీళ్లియ్యి, వాసంతీ."

"లోపల బిందెలో ఉన్నాయి" కిటికీలోంచి చూస్తూ జవాబు చెప్పింది వాసంతి!

"ఏదో జరిగిం"దనుకున్నాడు వాసుదేవరావు. నాలుగైదు రోజులనుంచీ వాసంతిలో ఏదోమార్పు కనిపెట్టాడతను. దాన్ని గురించి శ్రద్ధగా ఆలోచించలేదు. ఇదివరకు తనంతట తను ఎన్నోకబుర్లు కొట్టిపోసే వాసంతి ఈమధ్య తను మాట్లాడించినా సరిగా మాట్లాడటంలేదు.

"ఏమిటి ఫిర్యాదు"?

"ఫిర్యాదులు చెయ్యటానికి నేనెవర్ని?"

"వ్యవహారం ఏదో చాలాదాకా పోయిం ద"నుకున్నాడు వాసుదేవరావు. దగ్గిరికివెళ్ళి "ఏమిటి వాసంతీ, ఇది?" అన్నాడు.

ఆమె ఏమీ తొణకకుండా "ఏమీలేదు" అంది.

"అయితే, ఇటువంటి జవాబులు చెప్పటానికి కారణం?"

"నాకు ఓపిక లేదు."

"ఏం?"

వాసంతి జవాబు చెప్పలేదు. కాసేపటిదాకా వాసుకూడా ఏమీ మాట్లాడలేదు.

"నీకెందుకో కోపం వొచ్చినట్టుంది."

"కోపం ఎందుకు?" అంది వాసంతి, స్పష్టంగా కోపం వొచ్చినట్టు కనబరుస్తూ.

"ఎందుకనే నేనూ అడుగుతున్నాను"

"కోపమూలేదు, ఏమీలేదు. నాతో మాట్లాడుతూ మీ టైంపాడుచేసుకోటంఎందుకు? మీ స్నేహితుడు కనిపెట్టుకు కూచుంటాడు మీ కోసం. వెళ్ళండి."

అసలు విషయం కొద్దిగా అవగతమయింది వాసుదేవరావుకి "అదా సంగతి!" అన్నాడు నవ్వుతూ. వాసంతి కనుమలు ముడిచింది.

"వా డెన్నాళ్లుంటాడు వాసంతీ? చిన్ననాటి స్నేహితుడు. మూడేళ్ళ తరవాత కనపడ్డాడు. ఈ ఊళ్ళో మిగిలిఉన్న ఆ ఇల్లుకూడా అమ్మేస్తున్నాడు. ఇహముందు ఈఊరు రావాలిసిన అవసరంకూడా ఉండదు వాడికి. మళ్ళీ ఎన్నాళ్ళకో కనపడేది. ఆ ఇంటి బేరంకోసం తిరుగుతున్నాం. దాంతో బొత్తిగా టైం చాలటంలేదు. ఈ మాత్రం దానికి నువ్వింత చిన్నబుచ్చుకోట మెందుకు?"

ఇంటి బేరంకోసం ఏమాత్రం తిరుగుతున్నారో వాసంతికి తెలుసు. టైం చాలటంలేదుట. దేనికి? తనతో మాట్లాడటానికా? ఈ ఆలోచన తట్టటంతోనే చివాలునలేచి విసురుగా లోపలికి వెళ్ళిపోయింది వాసంతి. సరైన సమాధానం ఇచ్చాననుకున్న వాసుదేవరావు దిగ్భ్రాంతుడయాడు. ఈ పరిణామంవల్ల ఏమీ తోచక అతను ఓనిమిషం అలాగే నిలబడ్డాడు. మరి కాసేపటికి వాసంతి ద్వారం దగ్గిరకొచ్చి అంది:

"వొచ్చేటప్పుడు నాలుగు ఆస్ప్రో ప్యాకెట్లు కొనుక్కురండి."

"ఊఁ" అన్నాడు అతను అప్రయత్నంగా. తన ప్రయత్నంలేకుండా తనంతట తనే ఆమె ఏదో అడగటంతో వాసు కొంత కుదుటబడ్డాడు. తన జవాబుతో ఆమె సమాధానపడ్డదని ఊహించుకున్నాడు. కాని దురదృష్టవశాత్తూ ఆస్ప్రో ప్యాకెట్ల అవసరం ఏమిటో అడగాలనే ఊహ అతనికి స్ఫురించలేదు, ఆ సమయంలో. వాసంతికి అప్పుడప్పుడు కోపం రావటం, ఆ సమయాల్లో ఆమె అతనితో మాట్లాడకపోవటం మామూలే. ఆరోజుకూడా ఆమెకి కోపం వొచ్చినట్టు స్పష్టపడ్డం వల్ల కొన్నాళ్ళ మౌనవ్రతం తప్పదనుకున్నా డతను. గాలి దుమారంవేసే సూచనలు కనిపించి, మరుక్షణంలోనే అవి అదృశ్యంకావటం జరిగిందను కోటంవల్ల వాసుదేవరావు సంతోషస్వాంతుడై ఆ ఆనందంలో వాసంతి మాటల్లోని అర్థం గ్రహించలేకపోయాడు. అతను "ఊఁ" అని మాత్రం అనేసి బయటికి వెళ్లిపోటం చూసి వాసంతి తల గిరుక్కున తిప్పి లోపలికి వెళ్ళిపోయింది.

పికారుగా, శేఖరం అమ్మచూపుతున్న ఇంటిదాకా వెళ్లారు శేఖరమూ, వాసూ. శేఖరం ఇంట్లో అద్దెకుంటున్నాయన వాళ్ళని చూసి లోపలికి పిలిచి ఆ ఇంటి అమ్మకం వ్యవహారం ఎత్తాడు. ఆ ఇంటిని కొనటానికి తను ఎరిగిన వాళ్లు చాలామంది సిద్ధంగాఉన్నారనీ, ఫలానా ఫలానావాళ్ళు ఇంటినిచూసిపోయారనీ చెబుతూ శేఖరానికి లాభకరంగా ఆ వ్యవహారాన్ని

ఫైసలు చెయ్యగలనని హామీ ఇచ్చాడు. ఆయనకి కృతజ్ఞత తెలియబరచి శేఖరం, వాసూ బయటికొచ్చేసరికి బాగా చీకటిపడ్డది. ఈ వ్యవహారం విషయం మాట్లాడుతూ, ఆస్ప్రో ప్యాకెట్ల సంగతి పూర్తిగా మర్చిపోయాడు వాసు. రాత్రి రెండింటికి పడుకోటానికి వొచ్చినప్పుడు వాసంతి ఈ సంగతి ఎత్తేదాకా అసలు అతనికి ఆ విషయమే జ్ఞాపకం రాలేదు.

“ఆస్ప్రో ప్యాకెట్లు తెచ్చారా?” ఆ విషయం అడగటానికి వాసంతికి అంతవరకూ అవకాశమే చిక్కలేదు. వాసంతి ప్రశ్నకు వాసుదేవరావు ఉలిక్కిపడ్డాడు. ఆమె అంతవరకూ మేలుకుని ఉండటంవల్ల ఆశ్చర్యమూ, ఆస్ప్రో విషయం హఠాత్తుగా జ్ఞాపకం రావటంవల్ల కాస్త జంకూ కలిగాయి అతనికి. ఆ విషయం తప్పించాలని ప్రయత్నిస్తూ అన్నాడు.

“ఇంకా నువ్వు నిద్రపోలేదా?”

“నిద్ర ఎలా పడుతుంది?”

“ఏం?”

వాసంతి జవాబు చెప్పలేదు.

“ఆస్ప్రో తేలేదా?”

వాసుదేవరావు నసిగాడు.

“అవును. ఎందుకు జ్ఞాపకముంటుంది?” ఎత్తిపొడుపుగా అందామె.

“తల నొప్పిగా ఉందా?”

ఆమె జవాబుచెప్పకుండా గోడవైపుకు తల తిప్పుకుంది. వాసుదేవరావు మనసులో కాస్త చింతించాడు, జరిగిన పొరపాటుకి. అయినా బయటికి మాత్రం అతనేమీ అనలేదు. ఆ పరిస్థితిలో మాట్లాడక పోవటమే ఉత్తమ మనుకున్నాడు.

“ఆయన ఎంత విడిచిపెట్టలేని స్నేహితుడయినా, ఇంట్లో వాళ్ళసంగతి కూడా కాస్త చూడొచ్చుగా” అంది కుపితస్వరంతో వాసంతి, వాసుదేవరావు మాట్లాడకపోవటం గమనించి.

“ఆ ఇల్లు అమ్మే వ్యవహారం గొడవలోపడి మర్చిపోయాను, వాసంతీ” అన్నాడతను క్షమాపణ వేడుకుంటున్నట్టు.

“నాకంటే మీకు ఆయనే ఎక్కువని తెలుస్తూనే ఉందిలెండి. ఎంత పనికిరాకపోయినా కాస్త మందులూ మాకులూ తెచ్చిపడెయ్యొచ్చుగా. అది కూడా మర్చిపోయేటంత పనికిమాలినదాన్నా నేను?” వాసంతికి కళ్ళలో నీళ్ళు తిరిగాయి. కాని వాసుదేవరావు అది గమనించే అవకాశం లేదు. ఈ మాటలు విని అతనికి జాలి వెయ్యటంపోయి కొంచెం కోపం వచ్చింది.

“అనవసరంగా పోలికలు తెచ్చుకుని బాధపడతావెందుకు? చెబితే గ్రహించవేం ఖర్మం?” విసుగ్గా అన్నాడతను. ఈ విసుక్కోటం చూసి వాసంతికి అరికాలిమంట నెత్తికెక్కింది.

“స్నేహితుడు, స్నేహితుడు అని నెత్తికెక్కించుకోటమేగాని, డబ్బుదగ్గరికొచ్చేసరికి తెలుస్తుంది స్నేహితుడి సంగతి.”

“తెలియకుండా మాట్లాడి ఏం ప్రయోజనం? ఇలా మాట్లాడినందుకు తరవాత పశ్చాత్తాప పడాలిసొస్తుంది నువ్వు.”

“ఓ వందరూపాయలు అప్పడగండి. ఎవరు పశ్చాత్తాప పడతారో తెలుస్తుంది.”

“వందేమిటి, వాడిదగ్గరుంటే ఎంతైనా ఇస్తాడు, అడిగితే. డబ్బుకి మా యిద్దరిమధ్యా విలువ లేదు.”

“కబుర్లెందుకు? రెండురోజుల్లో ఇస్తామని రేపు ఓ వందరూపాయలు తీసుకురండి ఆయన దగ్గిర్నుంచి, చూద్దాం.”

వాసుదేవరావు ఇహ ఏమీ మాట్లాడలేదు. వాసంతి కూడా ఏమీ అనలేదు. మర్నాడు పొద్దున్నే లేచి సరాసరి శేఖరం దగ్గరికెళ్ళి అడిగాడు వాసుదేవరావు.

“ఓ వందరూపాయలుంటే ఇవ్వరా శేఖరం, మళ్ళీ రెండురోజుల్లో ఇస్తాను.”

పడకకుర్చీలో పడుకుని సిగరెట్టు పొగ తాపీగా వొదుల్తూ కేకేశాడు శేఖరం.

“ఉమా.”

ఉమ వొచ్చి తలుపుదగ్గర నుంచుంది.

“సూట్ కేస్‌లో ఓ వంద రూపాయల కాగితం ఉంది. ఇలా తే.” ఉమ తెచ్చి ఇచ్చింది. నోటందుకుని “రెండు రోజుల్లో ఇస్తా, ఇవాళా, రేపూ బ్యాంకు సెలవులు కదూ” అన్నాడు వాసు.

“వడ్డీ మర్చిపోతావేమో. అసలు నోటు

రాయించుకోవలిసింది. పోనీలే, పో.'' నవ్వాడు శేఖరం.

''ఎందుకైనా మంచిది. పోరు బాకీకింద రాసుకోటానికి సిద్ధపడు'' నవ్వుతూ అన్నాడు వాసుదేవరావు.

''ఒరేయ్, నేను బ్యాంకర్ని. చెవులు పిండి వసూలు చేస్తా.''

ఇద్దరూ పకపకా నవ్వారు. వాసుదేవరావు పరిగెత్తుతున్నట్టు నడిచి కిందికి వెళ్లి వాసంతి వైపు నోటు విసిరి అన్నాడు.

''తెలిసిందా శేఖరం సంగతి?''

కొంచెం అవమానంతో ఆమె తల దించుకుంది. కాని వెంటనే ఆమెకో ఆలోచన తట్టగా అంది.

''అప్పుడే ఏమయింది? రెండు రోజుల తరవాత మళ్ళీ నోటు తిరిగివ్వకుండా ఉండండి, తెలుస్తుంది. నాలుగు రోజులు ఆలస్యం చేస్తే, ఆయన బాకీ విషయం జ్ఞాపకం చెయ్యకపోతే నన్నడగండి.''

నాలుగు రోజులు కాదుగదా, నాలుగు నెలలైనా - ఆమాటకొస్తే అసలివ్వకపోయినా వాడి మనసేం మారదని ఘంటాపథంగా చెబుతున్నాను. రుజువు కావాలంటే, నువ్వే చూద్దువుగాని'' ఉద్రేకంతో అన్నాడు వాసుదేవరావు

''చూద్దాంగా'' అంది వాసంతి సవాలు చేస్తున్నట్టు.

బాకీ తీర్మానానికి పెట్టిన గడువు దాటిపోయింది. బాకీ తీరలేదు. ఎవరూ ఆ ప్రసక్తే తీసుకురాలేదు, ఇద్దరూ దాని విషయం మర్చిపోయినట్టు ప్రవర్తించారు. వాసుదేవరావుకి మాత్రం అన్న ప్రకారం బాకీ తీర్చలేదనే దుగ్ధ లోలోపల బాధపెడుతూనే వుంది. శేఖరం అసలా విషయం మర్చిపోయాడు. ఇంతలో అతని సెలవు అయిపోయింది. ఇంటి వ్యవహారం మాత్రం పరిష్కారం కాలేదు. తరవాత మళ్ళీ వీలుచేసుకుని వచ్చి ఆ విషయం ఆలోచించవచ్చని మద్రాసుకి ప్రయాణం కట్టాడు శేఖరం. ప్రయాణం రోజుమాత్రం డబ్బు లెక్క చూసుకున్నప్పుడు వాసుదేవరావు బాకీ,విషయం అతనికి జ్ఞాపకం వచ్చింది. కాని, మరు క్షణంలో ఆ సంగతే మర్చిపోయాడు. శేఖరం కుటుంబంతో సహా మద్రాసు వెళ్ళిపోయాడు.

మద్రాసు వచ్చిన పది రోజులకి ఓ రోజు ఉమ అంది.

''మీ స్నేహితుడు చాలా తెలివైనవాడండీ!''

ఉమ చేసిన ఈ రిమార్కు విని అది వ్యంగ్యంగా అన్నదో లేక నిజంగానే పొగడ్తో శేఖరానికి అర్థం కాలేదు.

''ఏం?''

''మనం అక్కడ ఉన్న నెల రోజుల ఖర్చు మన దగ్గరే వసూలు చేశాడు.''

శేఖరం ముఖం చిట్లించుకుని అన్నాడు.

''ఏమిటి నువ్వనేది?''

''అదే. ఆ వంద రూపాయలు.''

''ఇహ చాలించు.''

''ఉన్న మాట అంటే ఎందుకండీ అంత కోపం?''

''ఉన్న మాట అంటే కోపం ఎందుకుంటుంది? లేని మాట అంటుంటేనే ఒళ్లు మండుతుంది. వాళ్లింట్లో నెల రోజులూ ఉండి వాణ్ణి గురించి నువ్వు తెలుసుకున్నది ఇదా?''

''మీ అమాయకత్వం చూస్తే నవ్వొస్తుంది. స్నేహం స్నేహమే. డబ్బు డబ్బే. ఈ రెంటికీ ముడిపెడితే స్నేహం ఓడిపోవాలిసిందే.''

''వాసు విషయంలో నీ సూత్రాలు వర్తించవు.''

''వర్తించేదీ, వర్తించనదీ తెలుస్తూనే ఉందిగా.''

''ఏం తెలుస్తోంది?'' కోపంగా అన్నాడు శేఖరం

''అతను బాగా డబ్బున్నవాడని మీరే చెబితిరిగా.''

''ఉంటే?''

''డబ్బున్నవాడు అప్పు తీసుకుంటే, అది తీర్చటానికిన్నాళ్లు కావాలా?''

''వాడికిదేపనా ఏమిటి? ఈ వెధవ వంద రూపాయలు అప్పు అసలు వాడికి జ్ఞాపకం ఉండొద్దూ?''

''అప్పులు మర్చిపోవటం సులభమేలెండి.''

"వాడలా ఏం మర్చిపోడు." అన్నాడు శేఖరం, ఇందాక తను అన్నదానికి విరుద్ధంగా అంటున్నట్టు తెలిసి కూడా.

"ఆయనకి జ్ఞాపకం ఉండదని ఇప్పుడేగా మీ రంటిరి!"

శేఖరానికి సమాధానం దొరకలేదు.

"అసలివ్వకపోతే మాత్రం ఏం?"

"ఏమీలేదు. మీరేదో ఆయన్ని ఆకాశాని కెత్తుతూంటే చెబుతున్నాను. అక్కడున్న ఆ నెలరోజులూ రాసుకు రాసుకు తిరిగారు. చివరికి నాతో ఒక్కమాట మాట్లాడటానికికూడా మీకు టైం దొరకలేదు. అంత స్నేహితుడైన వాడు చెయ్యవలిసిందిలాగేనా?"

"ఇంతకీవాడు డబ్బు పంపించడంటావా?" అని అడిగాడు శేఖరం కొంచెం స్వరం ఎక్కువ చేసి.

"నే నెందుకంటాను?" అంది ఉమ వ్యంగంగా.

శేఖరానికి ఉక్రోషం వచ్చింది. అప్పటి నుంచీ రోజూ పోస్టుకోసం ఆదుర్దాగా ఎదురు చూడసాగాడు, ఎప్పుడు వాసు దగ్గిర్నుంచి మనియార్డర్ వొస్తుందా, ఎప్పుడు ఉమని తల వాచేట్లు చీవాట్లు పెడదామా అని. అలా మూడు నెలలదాకా ఎదురు చూస్తూనే ఉన్నాడు. ప్రతిరోజూ టపాకోసం ఎదురు చూడటం, తీరా టపా వొచ్చింతరవాత అందులో వాసు దగ్గిర్నుంచి మనీ ఆర్డర్ లేక పోవటంమూసి అతని ప్రాణం విసిగింది. మొదట మొదట ఉత్తరాలుతెచ్చే ఆఫీసు కుర్రాడిమీద, తరవాత పోస్టుమన్ మీదా, ఉమమీదా అతని కోపం చిందులు తొక్కింది.

ఎంత ఆలోచించినా వాసు డబ్బు పంపక పోవటానికిగల కారణమేమిటో శేఖరానికి తట్ట లేదు. చిన్నప్పటి సంగతులు ఒక్కటి కూడా మరిచిపోకుండా ఏకరువు పెట్టినవాసు తనదగ్గిర వందరూపాయలు అప్పుతీసుకున్న సంగతి మర్చి పోతాడని అనుకోటానికి ఆధారంలేదు. ఎలా మర్చిపోతాడు? అప్పు అడిగేటప్పుడు అతని ముఖంలో ద్యోతకమైన ఒకవిధమైన అభిమానం ఇప్పటికీ శేఖరానికి జ్ఞాపకం ఉన్నది. కొద్దిగా ఎర్రబడ్డ అతని ముఖం చూసి అడగటానికి సిగ్గు పడ్డాడని కూడా తను కనిపెట్టాడు. అలాంటి వాడు అప్పుతీసుకున్న సంగతే ఎలా మర్చిపో గలడు? మరి జ్ఞాపకం ఉంటే బాకీ తీర్చకపోవ టానికి కారణం? బద్ధకించాడని అనుకోవటానికి కూడా వీల్లేదు. అప్పుడప్పుడు ఉత్తరాలు రాస్తూనే ఉన్నాడు. ఉత్తరాల్లో ఈ సంగతి అసలు రానేలేదు.

చిరాకుతోపాటు శేఖరానికి అసహనం ఎక్కువైంది. ఈ వందరూపాయల సంగతి తనైతే ఎప్పుడో మర్చిపోయి ఉండేవాడు. కాని ఉమ ఎత్తిపొడుపులు అతను సహించ లేకుండా ఉన్నాడు. వాసుప్రసక్తి తీసుకొచ్చి అతన్ని బాధించటంలో ఉమకి ఓ విధమైన మానసిక తృప్తి ఏర్పడేది. వాసంతికి మల్లేనే, ఉమకి కూడా శేఖరం వాసుల అన్యోన్యతవల్ల తనకేదో అన్యాయం జరుగుతుందనే భావం ఏర్పడ్డది. అంచేత అవకాశం దొరికినప్పుడల్లా శేఖరాన్ని వాసు విషయంలో ఎత్తి పొడవ టానికి సంకోచించేదికాదు ఉమ. ఆమె గొడవ పడలేక ఒక్కొక్కప్పుడు తనే వాసుపంపినట్లు తన అడ్రెసుకి మనీ అర్డర్ చేస్తే బావుంటుందనే ఆలోచన కలిగేది. కాని ఉమని వంచించ టంలో అతనికి ఆత్మతృప్తికనిపించలేదు. కాగా అతని చిరాకూ, అసహనమూ వాసుమీదికి తిరి గాయి. తమ స్నేహం ఎంత గొప్పదో, ఎంత పవిత్రమైందో ఉమకి ఋజువు చెయ్యలేక పోవటంవల్ల, అందుకు కారణభూతుడైన వాసు మీద అతనికి కొంచెం కోపం కూడా వచ్చింది.

రోజులు గడుస్తున్నకొద్దీ వాసు దగ్గిర్నుంచి డబ్బు వొస్తుందనే ఆశ పూర్తిగా వొదులు కున్నాడు శేఖరం. "ఒక్క వంద రూపాయ లకి లోభించాడా వాసు?" అని నిట్టూర్పు విడ వటం పరిపాటయిపోయిందతనికి. "పారుబాకీ కింద రాసుకోటానికి సిద్ధపడు" అని వాసు ముందే ఆలోచించి అన్నాడా?" అనికూడా అనుకున్నాడు.

"వంగతోటదగ్గిర చుట్టరికమేం పనికొస్తుం దండీ లేకపోతే?" అంది ఉమ, మాటలసంద ర్భంలో ఓరోజు వాసు ప్రసక్తి రాగా. ఉమ వైపు తేరిపార చూశాడు శేఖరం. ఈసారి ఉమ మాటలకి అతనికి కోపం రాలేదు.

"హృదయాలు ఒక్కటేననుకున్న వాసు ఇంతనీచంగా ప్రవర్తిస్తాడనుకోలేదు" అన్నాడు అతను బాధపడుతూ.

"స్నేహం ఉంటేఉండొచ్చుగాని, అది పురస్కరించుకుని నెలరోజులు ఊరికే ఎవడు తిండి పెడతాడండీ?"

"వాసు ఇంత లౌక్యుడనుకోలేదు. డబ్బు కావాలంటే పబ్లిగ్గా అడగలేదూ—" దానికి అప్పు అని పేరుపెట్టి హోటల్ బిల్లులా తిండి ఖర్చుకింద జమకట్టుకోకపోతే?"

కర్కశంగా అన్నాడు శేఖరం.

"పోనిద్దురూ" అంది ఉమ ఉదారంగా.

"డబ్బు. ఛీ. డబ్బుముందు ఇన్నేళ్ల స్నేహం కూడా దిగదుడుపేనా? ప్రపంచం అంతా స్వార్థంతో నిండిఉంది. వాసు కూడా అందరిలాంటివాడే నని ఇప్పటికైనా తెలుసుకోగలిగాను. ఇహ వాడిమొహం చూడను" ఉద్రేకంతో శపథం పట్టాడు శేఖరం.

ఈ సంఘటన జరిగిం తరవాత వాసు దగ్గిర్నించి రెండు ఉత్తరాలు వొచ్చాయి. ఆ రెంటికీ శేఖరం జవాబివ్వలేదు.

"ఎందుకీ శుష్కప్రియాలు?" అనుకున్నాడతను. వాసు రాసిన రెండో ఉత్తరంలో ఫలానా ఆసామీ ఫలానా మొత్తానికి శేఖరం ఇల్లు కొనటానికి సిద్ధంగా ఉన్నాడని శేఖరం ఇంట్లో అద్దెకుంటున్న ఆసామీ చెప్పినట్టుగా ఉంది. ఆఉత్తరం చూసుకుని శేఖరం గుంటూరు ప్రయాణమయ్యాడు.

గుంటూరులో దిగి శేఖరం సరాసరి తన ఇంటికి వెళ్ళి ఇంటి అమ్మకం వ్యవహారం గురించి మాట్లాడి హోటల్ కి వెళ్ళాడు. వాసు ఇంటికి అతను పోదల్చుకోలేదు. రెండు రోజులలో వ్యవహారం పరిష్కారం చేసుకుని, వొచ్చిన దోవనే మద్రాసు వెళ్ళిపోయాడు.

. శేఖరందగ్గిర్నించి.ఉత్తరం రాకపోవటంలో వాసు కొంచెం ఆశ్చర్యపడ్డాడు. తను రెండు ఉత్తరాలు రాసినా శేఖరం ఎందుకు జవాబివ్వలేదో అనికి అనూహ్యంగా ఉంది. మళ్ళీ అతనికి ఇంకో ఉత్తరం రాద్దామనుకుని, ఇంటి బేరం విషయంలో ఇంకేమైనా విశేషాలున్నాయేమో కనుక్కొని అది కూడా రాద్దామని, శేఖరం ఇంట్లో అద్దెకున్న ఆసామీ దగ్గిర కెళ్ళాడు వాసు.

వాసుని చూసి ఆయన అన్నాడు.

"ఏమండీ, కిందటిసారి శేఖరం గారితో మీరు రాలేదేం?"

అతని ప్రశ్న విని వాసు తెల్లబోయాడు.

"బహుశా మీరు ఊళ్ళో లేరేమో ననుకున్నాను. శేఖరంగారి నడిగితే ఆయన పరధ్యానంగా విన్నట్టున్నాడు— సమాధానం చెప్పలేదు."

వాసుముఖాన నెత్తురుచుక్క లేదు.

"శేఖరం వొచ్చాడా?" ఆశ్చర్యంతో అడిగాడు అతను. "ఎన్ని రోజులైంది?"

"నాలుగు రోజులైంది. దస్తావేజులు కూడా రిజిష్టరయిపోయాయి"

ఏమిటి దీనిఅంతరార్థం?

"మీరు ఊళ్ళో లేనప్పుడే అంతా సెటిలయిపోంది. ఇంకా శేఖరం గారు మీకు ఉత్తరం రాశారేమో ననుకున్నాను."

ఆ పెద్దమనిషి దగ్గిర సెలవు తీసుకుని వాసు ఇంటిముఖం పట్టాడు. ఇంటికెలా చేరుతున్నాడో అతనికే తెలియదు. శేఖరం ఇలా ఎందుకు చేశాడు? తన ఉత్తరాలకి జవాబు రాయకపోవటం, తనకి తెలియకుండా గుంటూరు వొచ్చి ఇల్లు అమ్ముకుని వెళ్ళిపోవటం—వీటికి గల కారణాలేమిటి? కారణాలు అని బహువచనం ఎందుకు? స్పష్టంగా తెలుస్తూనేఉంది—కారణం. ఎదురు చూసి చూసి, చివరికి ఇలా చేశాడా! వాసు కుర్చీలో కూలబడి తల చేతుల్లో పట్టుకున్నాడు. కాసేపటి తరవాత వాసంతి వొచ్చి అతన్ని ఆ స్థితిలో చూసి గాభరాగా అంది.

"తల అలాపట్టుకున్నారేం? తలనొప్పా?"

వాసు తలెత్తి వాసంతివైపు చూశాడు. అతని కళ్ళు ఎర్రబడ్డాయి. పెదవులు వొణికాయి. నిలువునా కంపిస్తూ అన్నాడు.

"డబ్బు. ఛీ."

వాసంతి ఇదేమీ అర్థంకాక తెల్లబోయి చూసిందతనివైపు. అతను హఠాత్తుగా ఆమె చెయ్యి పట్టుకుని ఊపుతూ అన్నాడు.

"డబ్బు. వాసంతీ, డబ్బు. మనుషులజుట్టు

పట్టుకుని ఆడిస్తోంది డబ్బు. ఏదైనా డబ్బు తరవాతే" విషాదంగా హేలు మారుమోగేట్టు నవ్వాడు వాసుదేవరావు. వాసంతికి భయం వేసింది.

"ఏమిటండీ ఇది?"

"నువ్వు గెలిచావు వాసంతీ. నువ్వు చాలా తెలివిగలదానివి. నేను ఒట్టి మూర్ఖుణ్ణి. శేఖరం నాకు మంచిపాఠం నేర్పాడు."

వాసంతికి పరిస్థితి కొంత అర్థమయింది. బహుశా శేఖరం డబ్బడుగుతూ ఉత్తరం రాశామోడే ననుకుంది.

వాసు హఠాత్తుగా ఆమె రెండుచేతులూ పట్టుకుని ఆమె కళ్ళలోకి చూస్తూ అరిచాడు.

"కాని మనిద్దరి మధ్యా కూడా డబ్బుకి ప్రమేయం ఉందా వాసంతీ? కనీసం నువ్వైనా డబ్బు గుప్పిటలోంచి తప్పించుకున్నావా?"

అతనిపట్టును విడిపించుకుంటూ అందామె,

"ఏమిటండీ ఇది?"

"చెప్పు వాసంతీ. నా హృదయం మండుతోంది. తల పగిలిపోతోంది. శేఖరం గుండెల్లో ఒక్కతన్ను తన్నాడు. నువ్వు ఎప్పుడూ తన్నవు గద?" జాలిగా, ప్రాధేయ పూర్వకంగా అన్నాడు వాసు. అతని పరిస్థితిచూసి వాసంతికి భయంవేసింది. ఒకవిధంగా అతని బాధకి తనే కారణమని ఆమెకి తెలియటంవల్ల ఆమె కొద్దిగా పశ్చాత్తాప పడసాగింది.

"చెప్పవేం, వాసంతీ?"

జవాబుగా ఆమె అతని క్రాపును సరిచేసింది. అతనామె అరచేతుల్లో తల పెట్టుకున్నాడు. స్పర్శవల్ల అతని కణతలు టకటక కొట్టుకుంటున్నట్టు వాసంతి అనుభూతి పొందింది.

మర్నాడు టపాలో శేఖరం అన్నిరోజులుగా ఎదురుచూసిన మనియార్డర్ వచ్చింది. మనియార్డర్ ఫారంమీద వాసు అడ్రస్ చూసి శేఖరం గుండె కొట్టుకుంది. "వాసుపట్ల ఎంత అనుచితంగా ప్రవర్తించాను!" అని పశ్చాత్తాపపడ్డా డతను. కాని మనియార్డర్ మొత్తం చూడగానే సంతకం చెయ్యటానికి చేతిలో పట్టుకున్న అతనికలం జారిపోయింది. మనియార్డర్ మొత్తం నూటరెండురూపాయలు నాలుగు అణాలు.

కూపన్ మీద వాసు దస్తూరీతో ఇలా ఉంది.

"మిస్టర్ శేఖరం—

ఇల్లు అమ్మినట్టు నాకు తెలిస్తే డబ్బుఅప్పు అడుగుతా ననుకున్నావా?- వాసుదేవరావు."

శేఖరం తోకతొక్కిన తాచులా మండిపడి మనిఆర్డర్ తిరక్కొట్టాడు. ఆరోజే వాసుకి ఉత్తరం రాశాడు, ఇలా.

"మిస్టర్ వాసుదేవరావు,

మనిఆర్డర్ తిప్పిపంపాను. మా కుటుంబానికి నెలరోజులు తిండిపెట్టినందుకు ఇంకా ఎక్కువైతే చెప్పు, పంపుతాను. ఇహ ఇల్లు అమ్మకం సంగతి నువ్వు చేసిన సహాయానికి కృతజ్ఞుణ్ణి. అమ్ముతున్నపుడు నీకు చెప్పటం అవసరమనుకోలేదు. ఇలా రాయవలసి వచ్చినందుకు నాకు చాలా బాధగా ఉంది. కాని ఏం చెయ్యను?- శేఖరం."

ఉత్తరం చదవటం పూర్తికాగానే వాసుదేవరావుకి నెత్తురు ముఖంలోకి చిమ్మింది.

"అయితే నేను హోటల్ కీపర్ నన్న మాట?" అన్నాడు అతను తనని తాను ఉద్దేశించి. "ఇదా వీడి విజ్ఞానం, వీడి తెలివి! వంద రూపాయలూ వాడిమొహాన కొట్టి నాలుగు దులిపివొస్తా. శేఖరం ఇంత మూర్ఖుడనుకోలేదు."

మర్నాడు మెయిల్లో మద్రాసు చేరుకున్నాడు వాసుదేవరావు. అతను సరాసరి శేఖరం ఇంటికి వెళ్ళాడు. అతను లోపలికి అడుగు పెట్టగానే శేఖరం బయటికొచ్చాడు. శేఖరాన్ని చూడగానే వాసుకి ఉద్రేకంతో ముఖం అంతా ఎర్రబడ్డది. వాసుని హఠాత్తుగా చూచి శేఖరం కొద్దిగా జంకాడు. వాసు జేబులోంచి వంద రూపాయల కాగితం తీసి శేఖరంవైపు విసిరి తీక్షణంగా అన్నాడు.

"మూర్ఖుడా, అజ్ఞానీ, పశువా! నేను హోటల్ కీపర్నా? అంత తెలివి మీరావా? ఎవడిక్కావాలిరా నీ వంద రూపాయలు?"

శేఖరానికి కూడా బాగా కోపంవొచ్చింది.

"అక్కర్లేకపోతే నెలల పర్యంతం ఎందుకుంచుకున్నావు?"

"కారణం వినటానికి కూడా నీకు అర్హత

లేదు. లోపల ఒకటీ బయట ఒకటీ ఉంటుందనుకోలేదు నీకు. నీకంటే బజార్లో తిరిగే…"

"అతిగా వాగకు. నువ్వు చేసిన పనికి…"

"ఏం చేశాను నేను! స్నేహితుడిచేత వెట్టిచాకిరీ చేయించుకుని వాడికి తెలియకుండా- డబ్బు అడుగుతాడనే భయంతో - ఇల్లమ్ముకున్నానా? ప్రాణం ఇచ్చే స్నేహితుణ్ణి హోటల్ కీపర్ అని తూలనాడానా? ఏం చేశాను నేను?"

వెంటనే ఏమనాలో శేఖరానికి తోచలేదు. వాసు ఆగకుండా అదే పనిగా అరుస్తున్నాడు.

"కాని ఒక్క పొరపాటు చేశానని ఒప్పుకుంటున్నాను. ఒక వంచకుణ్ణి, హృదయంలేని ఒక రాతి బొమ్మని, డబ్బు నేలమీద దుమ్ములో పడేస్తే నాలికతో నాకే ఒక పీనాసి పిసినిగొట్టుని…"

వాసు పూర్తి చేయలేదు. ఉక్రోషంతో, ఆవేశంతో, కోపంతో ఫెడేమని అతని దవడ మీద బలంకొద్దీ కొట్టాడు శేఖరం. దెబ్బ పడుతుందని ఊహించక అప్రమత్తుడుగా ఉండటం వల్ల, వాసు దెబ్బకి తట్టుకోలేక పక్కన ఉన్న బల్లమీద పడి దానిమీద వున్న ఫ్లవర్ వేస్‌తో సహా రఫీమని కింద పడ్డాడు. ఫ్లవర్ వేస్ పగిలి పెంకులు గుచ్చుకొని రక్తం కావటమే కాక కుడి చెయ్యి మడతపడి ఫ్రాక్చర్ కూడా అయినట్లుంది. వాసు స్పృహ తప్పి పడిపోయాడు.

ఈ ఆకస్మిక సంఘటనకి శేఖరం స్తంభాభూతుడైనాడు. చప్పుడు విని ఉమ లోపలినించి పరిగెత్తుకొచ్చి ఈదృశ్యం చూసి నిశ్చేష్టురాలైంది. శేఖరం ఆమెవైపు పిచ్చిగా చూశాడు. జరిగిన సంఘటన వెంటనే ఊహించుకుంది ఉమ. గుడ్లప్పగించి వాసువైపు చూస్తున్న శేఖరాన్ని చేత్తో కదిపి అందామె.

"డాక్టర్. త్వరగా డాక్టర్ని తీసుకురండి."

యంత్రంలా పరుగెత్తాడు శేఖరం. డాక్టరు వచ్చేటప్పటికి ఉమ తనకి చేతనైనంతవరకు ప్రథమ చికిత్స చేసింది.

డాక్టర్ చికిత్సచేసి వెళ్లిం తరవాత ఉమ అంది.

"వాసంతికి టెలిగ్రాం ఇవ్వండి."

శేఖరం ఏదీ ఆలోచించే స్థితిలోలేడు. యాంత్రికంగా వాసంతికి టెలిగ్రాం యిచ్చి వొచ్చాడు. మంచంమీద నిస్సహాయ స్థితిలో పడుకుని ఉన్న వాసుని చూస్తుంటే అతని హృదయంలో వేదనగా ఉంది. కలలో కూడా అనుకుని ఉండని పనిచేశాడతను. నెలరోజులు ఆపేక్షగా కుటుంబంతో సహా తనని మేపి, తనతో రాత్రింబగళ్లు కులాసాగా కబుర్లు చెబుతూ గడిపిన స్నేహితుణ్ణి నిర్దయగా, క్రూరంగా కొట్టాడు. ఎందుకు కొట్టాడు? తనలో అంత పశుత్వం ఎలా వొచ్చింది? అంత అహం ఎక్కడ దాక్కుని ఉంది? ఇంతకీ వాసు ఏమన్నాడని? తను చేసిన పనులే చెప్పాడు. తను కొంచెం ఓపిక పట్టినట్లయితే తన డబ్బు ఎందుకుఅన్నాళ్ళదాకా, తిరిగివ్వలేదో కారణం చెప్పేవాడు. తొందరపడి హేయంగా ప్రవర్తించాడు తను. కాని వాసు తనని అనవసరంగా ఎందుకు రెచ్చగొట్టాడు? అతనైనా కాస్త ఓర్పుతో మాట్లాడిఉంటే ఎంత బావుండేది!

శేఖరం ఇలా ఆలోచిస్తుండగా వాసు కళ్లు తెరిచి అతనివైపు చూశాడు. అది గమనించి శేఖరం కూడా అతనివైపు చూశాడు. ఓ క్షణం అలాగేచూసి వాసు మళ్ళీ కళ్లుమూసుకున్నాడు. అతని మంచానికి దగ్గరగావెళ్ళి శేఖరం అన్నాడు.

"నన్ను క్షమించు వాసూ."

వాసు మళ్ళీకళ్ళు తెరిచి అతనివైపుచూశాడు, కాని అతను మాట్లాడే స్థితిలోలేడు.

శేఖరం ఏదోచెప్పబోతుండగా ఉమఅతన్ని వారించింది, "డాక్టర్ మాట్లాడించ వొద్దన్నాడు" అంటూ.

మర్నాడు మెయిల్ కి వాసంతి వొచ్చింది. అప్పటికి వాసు బాగా తేరుకున్నాడు గాని డాక్టర్ అతన్ని మాట్లాడించవద్దని గట్టిగా చెప్పటంవల్ల శేఖరం అతనితో మాట్లాడటం సంభవించలేదు. వాసంతి రావటంచూసి శేఖరం నేరస్థుడిలా ఆమె వెనకాలే అడుగులు వేస్తూ వాసుపడుకునిఉన్న గదిలోకిచేరాడు. వాసుని ఆ స్థితిలో చూడగానే వాసంతి గుడ్లనీరు కుక్కుకుంది. "దీనికంతా ఒకవిధంగా నువ్వే కారణం"

అని ఆమె అంతరాత్మగోల పెడుతోంది. ఈ ఆలోచనతో ఆమెకి బొటబొట కన్నీళ్ళు రాలాయి. పక్కన ఉన్న ఉమని గూర్చి "ఏం జరిగింది?" అని నెమ్మదిగా ప్రశ్నించింది. ఉమకి బదులుగా శేఖరమే జవాబు చెప్పాడు.

"ఈ మూర్ఖుడు చెయ్యి చేసుకున్నాడు."

ఇటువంటిదేదో జరిగి ఉంటుందని ముందే ఊహించుకోటంవల్ల వాసంతి ఆశ్చర్యపడలేదు. సహజంగా శేఖరంమీద ఆమెకి చెప్పలేనంత కోపం వొచ్చింది.

శేఖరం మాటలు విని వాసు కళ్లు తెరిచాడు. ఎదురుగా వాసంతి కనిపించింది.

"వాసంతీ."

వాసంతి చీర కొంగుతో కళ్లు తుడుచుకుంది.

వాసు శేఖరంవైపు తిరిగి అన్నాడు.

"శేఖరం! కొడితే కొట్టావుగాని, ఆ దెబ్బతో మెదడు కదలబారి ఓసంగతి గ్రహించాను"

ఏమాత్రంకోపంగాని, నిరసనగాని లేకుండా ఇలా మాట్లాడిన వాసునిచూసి శేఖరానికి కళ్ళలో నీళ్లు గిర్రున తిరిగాయి.

"నన్ను క్షమించు వాసూ."

వాసు నవ్వి అన్నాడు.

"చివరికి నేనుకూడా క్షమాపణ అడగవలసిన అవసరం ఉంది గనక నిన్ను క్షమించటానికి నాకేమీ అభ్యంతరం లేదులే. సరే గాని నేను నీ బాకీ తీర్చకపోవటానికి, అసలు బాకీ తీసుకోవటానికీ కారణంచెప్పనా?" అని వాసు వాసంతివైపు ఓరగా చూశాడు. ఆమె తల పక్కకి తిప్పుకుంది.

శేఖరం ఆసక్తిగా "ఏమిటి?" అన్నాడు.

"మన ఇద్దరి స్నేహానికీ గీటురాయిగా డబ్బుని ఉపయోగించమని వాసంతి కోరింది. మన స్నేహం ఋజువుచేసుకోటానికి నేను ఒప్పుకున్నాను. సరే వందరూపాయలు నీ దగ్గర బదులు తీసుకున్నాను. బాకీ తీర్చకపోతే ఏం జరుగుతుందో తెలుసుకొనే ప్రయత్నంలో నీ బాకీ తీర్చటం పడలేదు" శేఖరం ముఖం వివర్ణమయింది. భావోద్వేగం ఆపుకోలేక వాసు పక్కమీద కూచుని అతని చేతిని తన చేతుల్లో తీసుకుని గద్గదికంగా అన్నాడు.

"ఎంత అపోహపడ్డాను! నన్ను క్షమించు వాసూ."

"పూర్తిగా విను. సరే, తరవాత జరిగిన కథ నీకు తెలుసనుకో. నేను చేసిన పొరపాటు ఏమిటంటే"—వాసు ఓసారి వాసంతివైపూ, ఉమవైపూ ఓసారి చూసి నవ్వుతూ మళ్ళీ అన్నాడు.

"మా వాసంతికిమల్లేనే సామ్రాజ్యతత్వం వంటబట్టిన వాళ్ళు ఇంకా ఉండొచ్చని ఊహించటంమర్చిపోయాను-ఉమాదేవిక్షమించాలిమరి"

ఉమ ఉన్న స్థానంలోంచి కదిలింది. వాసంతి గోడవైపు ముఖంపెట్టుకుని ఉండటంలో ఆమె ముఖభంగిమ ఏలా ఉందో తెలియదు.

"స్పష్టంగా చెప్పాలంటే, డబ్బు అనే గీటురాయి ఉపయోగించి నన్ను ఎలా బెదరగొట్టాలని వాసంతి కోరిందో అలాగే నన్ను కూడా బెదరగొట్టాలనే ప్రయత్నం జరిగి ఉండవచ్చని నేను మొదట్లో ఊహించుకో లేకపోయాను. మంచంమీద రెండు రోజులు తీరిగ్గా పడుకుని ఈ సమస్యని ఛేదించాను. నా ఊహాగానం సరైందో. కాదో తేల్చు."

"నీ బుర్ర అమోఘమైంది వాసూ. నువ్వు తప్పటమంటూ ఎప్పుడుంది గనుక?"

"ఇహ జరిగిందానికి పూర్తి బాధ్యత మన ఇద్దరిదీ. మన స్నేహానికి గీటురాయి డబ్బు కాలేదు-అపోహ. ఇద్దరమూ అపోహ పడ్డాం. ఏమాత్రం తెలివితేటలు ఉపయోగించినామనకి ఇది మొదటే తట్టేది. కానిమనం కళ్లు మూసుకున్నాం. మనం ఓడిపోయామని నిస్సంకోచంగా ఒప్పుకుందాం. ఇహ ఓడిపోకూడదని ప్రతిజ్ఞ తీసుకుందాం. కాని ఈ తెలివి నాకు ముందే ఉందయించి ఉంటే నీకీ డాక్టర్ బిల్ తప్పేదిగదా అని నా విచారం."

శేఖరం నవ్వాడు. ఆ నవ్వులో బాధ మిళితం కాకపోలేదు. వాసంతి ఇందాకటినించీ ఏడుస్తోందేమో వాసు అన్న చివరి మాటలకి ఆమె కళ్లు తుడుచుకుంది. శేఖరం ఆమెవైపు జాలిగా చూడటం చూసి వాసు అన్నాడు నవ్వుతూ,

"మరేం లేదులే శేఖరం, మా వాసంతి కెప్పుడూ నెత్తిమీద నీళ్ల కుండ ఉంటుందిలే."